ఓంశ్రీసాయిరాం

# జనకచక్రవర్తి

(మిథిలాపురము విదర్భదేశమునకు రాజధాని. జనకుడువిదర్భ దేశపు చక్రవర్తి. ఇతడు గృహస్థుడు. రాచకార్యములందు నిమగ్నుడై కూడను, నిరంతరము ఆత్మతత్త్వమునే విచారణ సలుపుచుండెడివాడు. కాయమును మరచుచుండెడివాడు. అందువలననే ఈ రాజునకు విదేహుడని పేరు వచ్చెను. తాను క్షత్రియుడైనప్పటికి అనేకమంది బ్రాహ్మణ పండితోత్తములచే తత్త్వవిచారణ సలిపి, పండితులను పరీక్షించు చుండెడివాడు. తత్త్వశాస్త్రము జనకుని ఆటస్థలము. అతని హృదయము అతి నిర్మలము. అతని ప్రబోధలు అక్షరము తప్పని వేదవాక్యములు. అతని రాజభవనము నిరంతరము పండితుల చేతను, యోగుల చేతను, తత్త్వజ్ఞాన వృద్ధులచేతను కిటకిటలాడుచుండెడిది. వేయేటికి మిథిలాపురము ఆధ్యాత్మికచిత్తులకు ఆటస్థలము, ఆశ్రమముగా నుండెడిది. మహాజ్ఞానియైన యాజ్ఞవల్క్యుడు జనకునకు పరమ సన్నిహితుడు. అతని ప్రోత్సాహముచేతనే మిథిలాపురము యోగులకు ఆశ్రమముగను, భక్తులకు పుణ్యక్షేత్రముగను, జ్ఞానులకు గమ్యస్థానముగను సార్థకనామమునందుకొనెను. ఎట్టి వాంఛలు లేని త్యాగి జనకచక్రవర్తి. అతని పుత్రికా రత్నమే సీత. శ్రీరామచంద్రుడు అతని అల్లుడు. అట్టి సంబంధము గలిగిన జనకుడు ఎట్టి పవిత్రుడో పాఠకులే నిర్ణయించుకొనవచ్చును. ధన, కనక, వస్తు, వాహనములెన్నియున్నను దైవమే ప్రధానమని భావించి సర్వమును త్యజించి సాయుజ్యమును సాధించిన సర్వజ్ఞుడు జనకుడు. )

**దేహభ్రాంతి లేని మోహమింతయు లేని**
**త్యాగనిరతులైన యోగవరులు**
**గురులు నాడు నేడు గురులట్టివారలె**
**సత్యమైన బాట సాయిమాట.**

రాజయోగమనగా కర్తవ్యకర్మలాచరిస్తూ, దాని ఫలనిమిత్తము యోచించక లోకక్షేమాన్ని, సమాజముయొక్క అభివృద్ధిని ఆదర్శప్రాయంగా నిరూపించాలి. అదియే జనకమహారాజు చేసిన తపస్సు. భక్తితో భగవంతుని తలచుచూ, నిత్యధర్మములను నిర్వర్తించుచున్న అదియే రాజయోగమని జనకుడు నిరూపించాడు. జనకమహారాజు రాజుగా రాజ్యాన్ని పరిపాలించాడు, గృహస్థునిగా జీవించాడు. త్యాగిగా అనుభవించాడు. అన్నింటిని ఆత్మయందు లయము చేశాడు. మనోచిత్తయింద్రియములను, అహంకారము అన్నింటిని అహమనే ప్రజ్ఞలో లీనముచేయటమే రాజయోగము.

రాజ్యపాలనలో ఎప్పుడో ఒకప్పుడు సత్యమూ, న్యాయమూ పాటించకపోవటం వల్ల రాజులు అధోలోకాలకు పోతారని అంటారు. నిజానికి రాజ్యమనేది రాజుకు శరీరం వంటిది. తన రాజ్యంలో ఎంతదూరానవున్న ప్రాంతంపట్లనైనా రాజు శ్రద్ధ చూపించాలి. తన శిరోభాగమునూ, పాదాగ్రమునూ కాపాడుకొన్నంత శ్రద్ధతో పరిపాలించాలి. తన శరీరంలో ఏ భాగానికి బాధ కలిగినా వెంటనే నివారించినట్లు తన రాజ్యంలో ఏ బాగంలో బాధ ప్రబలినప్పటికీ సత్వరమే నివారించాలి. అటువంటి రాజు అధోలోకానికి పోడు. అటువంటి రాజు ముమ్మాటికీ ధన్యుడు. జనకుడు రాజ్యమంతా భగవంతునిదేగాని తనది కాదని తలచేవాడు. తనకు శరీరం వున్నప్పటికీ తాను అశరీరియైనట్లు, అసంసారియైనట్లు భావించుకొనేవాడు.

మిథిలాపురమునకు సమీపంలో వున్న ఒక అరణ్యంలో శుకమహర్షి కొంతమంది శిష్యులను చేర్చుకొని ఆత్మజ్ఞానమునకు సంబంధించిన విషయములను బోధిస్తుండేవాడు. ఈ వార్త విని, జనకమహారాజు తానుకూడా

వినటానికి రోజూ అరణ్యములోనున్న మహర్షి ఆశ్రమమునకు వచ్చేవాడు. అటువంటి శిష్యుడు లభించినందులకు శుకమహర్షి ఎంతో ఆనందించాడు.

ఒక దినము జనకమహారాజు ఎప్పుడూ వచ్చే సమయమునకు రాలేదు. మిగతా శిష్యులు కొంతసేపైన తరువాత మహర్షిని ప్రబోధను ప్రారంభించమని కోరారు. కానీ, మహర్షి, 'జనకుడు రావాలి. అతడు వచ్చిన తరువాతనే ప్రారంభిస్తాను' అన్నాడు. శిష్యులకు కోపం వచ్చింది. గురువుమీద సందేహము కలిగింది. 'శుకమహర్షి అంతటివాడు కూడా రాజు పేద అన్న భావమును వదల లేదు. మన మంతా శిష్యులము కామా?' అని వారిలో వారు

తర్కించుకుంటున్నారు. శుకమహర్షి వారి భావములను గ్రహించారు. ఇంతలో జనకమహారాజు వచ్చాడు. శుకమహర్షి ప్రబోధలను ప్రారంభించాడు. సమయం చూసి శిష్యులకు జనకుని గొప్పతనము తెలియజేయాలని సంకల్పించాడు.

ఒకరోజు శుకమహర్షి ప్రబోధలు చేస్తున్నాడు. శిష్యులందరూ శ్రద్ధగా వింటున్నారు. ఉన్నట్లుండి మహర్షి, ' ఇదేమిటి మిథిలానగరమునకు అగ్ని ప్రమాదము సంభవించింది. మంటలు పొగలు బాగా కనబడుతున్నాయి' అన్నాడు. తక్షణమే శిష్యులందరూ, ' అయ్యో! మా ఇళ్ళు యేమైపోయాయో! మా తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారో!' అని ఆందోళన పడుతూ మిథిలానగరం వైపు పరుగెత్తుకొని వెళ్ళారు. జనకమహారాజు మాత్రం కదలక మెదలక కూర్చున్నాడు. శుకమహర్షి అతనితో,' నాయనా! రాజభవనం, అంతఃపురం అంతా అగ్ని ప్రమాదమునకు గురైంది. నీవు వెళ్ళి చూడవా? ' అన్నాడు. జనకుడు ఏమీ జరగనట్లు కూర్చున్నాడు. కొంతసేపటికి పరుగెత్తుకొని పోయిన శిష్యులంతా తిరిగి వచ్చారు. 'గరుపుగారు! మిథిలాపురం దగ్గరికి పోయేటప్పటికి మంటలు లేవు. ఏవిధమైన ప్రమాదము లేదు. ఇదేమిటి ఈ వింత! ఇక్కడనుంచి పొగ మంటలు చూచామే! జరిగిన దేమిటో చెప్పండి' అని ప్రార్థించారు. వారు జనకమహారాజు తన స్థానమున యేమీ జరగనట్లు కూర్చుని ఉండటం గమనించారు. శుకమహర్షి చిరునవ్వుతో, ' నాయనలారా! నేనే ఈవిధముగా ఒక దృశ్యము కల్పించాను. మిమ్ములను పరీక్షించాలన్న ఉద్దేశ్యంతో, మీరు ఒక్కొక్కరు ఒక గృహమునకే సంబంధించినవారు. కానీ, జనకమహారాజు ఈ రాజ్యమునకంతా అధికారి. అంతేకాదు తన అంతఃపురం కాలిపోతుందని తెలిసినా యేమాత్రం చెక్కుచెదరక, బెదరక సమచిత్తముతో, ఏకాగ్రతతో ఇక్కడే ఉండిపోయాడు. మీరందరూ తలోదారీ పరుగెత్తుకొని వెళ్ళారు. మరి మీరే చెప్పండి. జనకుడు ఎటువంటివాడో! ఏకాగ్రత, సమచిత్తము, వైరాగ్యం ఉన్నవారే ఆత్మజ్ఞానమునకు సంబంధించిన ప్రబోధలు వినుటకు అర్హులు. అందుకనే ఆనాడు నేను అతని కొరకు వేచియుంటిని' అన్నాడు. శిష్యులందరూ గురువుగారిని క్షమించమని ప్రార్థించారు. శ్రీకృష్ణపరమాత్మకు అర్జునుడెట్టి శిష్యుడో, శుకమహర్షికి జనకుడట్టి శిష్యుడు.

ఒకానొక సమయంలో జనకమహారాజు యాజ్ఞవల్క్యుని కడకేగి, 'గురూజీ! నా పూర్వజన్మ వృత్తాంతమును నేను వినగోరుతున్నాను. దయచేసి నాకు తెలియజేయమని ప్రార్థిస్తున్నాను' అని అన్నాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు, 'చక్రవర్తీ! గడచిదేదియో గడచిపోయినది. దానిని గురించి చింతించి ప్రయోజనము లేదు. ఇది నీకు శ్రేయస్కరము కాదు' అని అనేకవిధములుగా జనకునికి నచ్చజెప్ప ప్రయత్నించాడు. కాని, చక్రవర్తి తన కోర్కె తీర్చమని పట్టుపట్టాడు. చివరికి యాజ్ఞవల్క్యుడు తన దివ్యదృష్టితో పరికించి, 'జనకా! ఈ జన్మలో ఏ స్త్రీ అయితే నీకు ధర్మపత్నిగా వున్నదో, ఆ స్త్రీయే పూర్వజన్మలో నీకు తల్లిగా వుండినది' అని అన్నాడు. ఈ మాటలు విన్నంతనే జనకుడు మానసిక పరివర్తన చెందాడు. 'ఛీ! నేనెంతటి దుష్టుడను. ఆనాటి తల్లినే ఈనాడు భార్యగా అనుభవిస్తున్నాను. ఇట్టి దుర్మార్గపు జీవితాన్ని నేనింక త్యాగం చెయ్యాలి' అని తలంచాడు. ఆనాటి నుండియే జనకుడు సంసారాన్ని త్యాగం చేసి వైరాగ్యంలో ప్రవేశించి జ్ఞానతత్త్వాన్ని అనుభవించాడు.

జనకుడు జ్ఞాని. నిత్యమూ అద్వైతానుభూతిలో ఉండేవాడు. సులభ అనే ప్రఖ్యాత తార్కికురాలు ఒకనాడు

జనకుని దగ్గరకు వెళ్ళి వాదించింది. 'నీ జ్ఞానదృష్టికి మానవులందరూ ఒక్కటే! కాబట్టి నన్ను నీ రాణిగా స్వీకరించి, పండితులు సమదర్శనులని నిరూపించు' అంటుంది. అప్పుడు జనకుడు, ' జ్ఞానదృష్టికి అందరూ ఒక్కటే, కనుక, స్త్రీపురుష విభేదం ఉండదు' అని చక్కగా సమాధానము చెప్పి సులభకు నిజమైన జ్ఞానోదయం కలిగించాడు.

ఒకసారి జనకమహారాజు తన రాజ్యంలో ఎవరైనా, పండితులైనా, మహనీయులైనా, ఋషులుకాని, యోగులుకాని తనకు ఆత్మజ్ఞానం బోధించాలని చాటింపు వేయించాడు. 'గుఱ్ఱముయొక్క ఒక రికాబులో కాలు పెట్టి రెండవ రికాబులో కాలు పెట్టే లోపలనే నాకు ఆత్మానందం బ్రహ్మప్రాప్తి చేకూర్చాలి' అన్నాడు. ఆరాజ్యంలోనున్న యోగులకు, ఋషులకు ఒకవిధమైన భయం ఏర్పడింది. ఇది మన విద్యకు పరిక్షా ఘట్టము అన్నారు. కాని, ఈ పని చేయుటకు ఎవ్వరూ పూనుకోలేదు. ఆ రాజ్యంలోకి ప్రవేశించాడు అష్టావక్రుడు. అక్కడ చాలామంది పండితులు, వేదాంతులు, మహనీయులు చాలా విచారంగా కూర్చొని న్నారు. అష్టావక్రుడు వారిని సమీపించి, 'మీ విచారమునకు కారణమేమిటి?' అని అడిగాడు. వారు జరిగిన విషమంతా చెప్పారు. 'ఇదేనా!దీనికి విచారించనక్కరలేదు. నేను దీనికి తగిన జవాబు చెప్తాను' అని పలికి, జనకమహారాజు ఆస్థానానికి వెళ్ళాడు. 'రాజా! నీకు ఆత్మజ్ఞానం బోధించటానికి నేను సిద్ధంగా ఉన్నాను. అయితే, ఈ రాజభవనమంతా రజో తమో గుణములతో నిండియున్నది. కాబట్టి, ఇక్కడ ఆత్మజ్ఞానము ఉపదేశించటానికి వీలుకాదు. మొట్టమొదట నిన్ను శుద్ధసాత్వికములో ప్రవేశపెట్టాలి. అందు నిమిత్తం నీవు నా వెంట రావాలి' అన్నాడు. జనకుడు అంగీకరించి అష్టావక్రుని వెంట వెళ్ళాడు. రాజువెంట కొన్ని గుఱ్ఱములు, సైన్యము వెళ్ళినాయి. పరివారమంతటిని ఒకచోట  ఉండమని చెప్పి జనకమహారాజు, అష్టావక్రుడు అరణ్యం లోపలికి వెళ్ళారు. అప్పుడు అష్టావక్రుడు, 'రాజా! నీకు ఆత్మజ్ఞానమును బోధించేవాడను కాబట్టి నేను గురువును, నీవు శిష్యుడవు. దీనికి నీవు అంగీకరించినట్లైతే నాకు ముందుగానే గురుదక్షిణ యివ్వాలి. ఆ తరువాతనే ఉపదేశం ప్రారంభిస్తాను' అన్నాడు. ' నాకు కావలసినది బ్రహ్మప్రాప్తి. నేను సర్వమును త్యజించి దేనినైనా యిస్తాను' అన్నాడు. 'నాకు యేమీ అక్కరలేదు. నీ మనస్సును మాత్రం యివ్వు' అన్నాడు అష్టావక్రుడు. 'యిచ్చినాను' అంటూ జనకమహారాజు, 'ఇంక నాకు మనస్సు లేదు. అది మీ అధీనంలో ఉంది' అన్నాడు. అప్పుడు అష్టావక్రుడు ఒక గుఱ్ఱాన్ని తెప్పించి నిలబెట్టాడు. 'మహారాజా! ఇక్కడ కూర్చో' అన్నాడు. జనకమహారాజును మార్గమధ్యమున కూర్చోబెట్టి అష్టావక్రుడు తాను వెళ్లిపోయి అరణ్యంలో ఒక చెట్టు క్రింద ప్రశాంతంగా కూర్చున్నాడు.

సైనికులు ఎంతోసేపు చూశారు. మహారాజుకాని, అష్టావక్రుడుకాని తిరిగి రాలేదు. వారేమైపోయారోనని ఒక్కొక్కరు అరణ్యం లోపలికి ప్రవేశించారు. అరణ్యంలో మార్గమధ్యంలో గుఱ్ఱము నిలబడి ఉంది. మహారాజు కన్నులు మూసుకొని క్రింద కూర్చున్నాడు. కదలటం లేదు. మెదలటం లేదు. అష్టావక్రుడు అసలే ఎక్కడా కనిపించ లేదు. 'అయ్యో! అష్టావక్రుడు మా మహారాజుకు మంత్రమో, తంత్రమో వేసినట్లున్నాడు. మహారాజు స్తంభించిపోయివున్నాడు' అని మంత్రులు, సైనికులు చాలా దిగులు పడ్డారు. ప్రధానమంత్రి రాజుని సమీపించి, 'మహారాజా! మహారాజా!' అని పిలిచాడు. ఏవిధమైన సమాధానము రాలేదు. జనకుడు కన్ను తెరవలేదు. నోరు విప్పలేదు. ఏమాత్రం కదల లేదు. ప్రధానమంత్రి చాలా భయపడిపోయాడు. 'ఎంతో కాలము గడిచింది. మహారాజుగారికి ఏవిధమైన ఆహారపానీయాదులను అందివ్వలేదే!' అని బాధపడ్డాడు. అరణ్యానికి తెల్లవారే వచ్చారు అందరూ. సాయంకాలం దాటిపోతున్నాది. ఇంక చేసేదేమీ లేక అంతఃపురానికి రథము పంపించాడు మహామంత్రి. మహారాణి రానే వచ్చింది. ఆమె పిలుస్తే ఒకవేళ మహారాజు పలుకుతాడేమో నని భ్రమ మంత్రికి. మహారాణి జనకుని దగ్గరకు వెళ్ళి, 'మహారాజా! మహారాజా!' అని పిలిచింది. కాని, ఏవిధమైన జవాబు లేదు. ఈ లోపల అష్టావక్రుడు ఎక్కడ వున్నాడో చూచి రమ్మని మంత్రి సైన్యాన్ని పంపించాడు. ఒక చెట్టు క్రింద ప్రశాంతంగా కూర్చొని ఉన్నాడు అష్టావక్రుడు. సైనికులు ఆయనను పిలుచుకొని వచ్చి, 'చూడండి, మహారాజు ఎట్లయిపోయినాడో!' అన్నారు. అష్టావక్రుడు

చిరునవ్వుతో, 'మహారాజుకేమి! క్షేమంగా వున్నాడే!' అంటూ, 'మహారాజా!' అని పిల్చాడు. అతడు కన్నులు తెరచి, 'స్వామీ!' అన్నాడు. 'మహరాజా! రాణీగారు వచ్చారు. మీ పరివారమంతా వచ్చారు. మీరెందుకు వారితో మాట్లాడటం లేదు?' అని ప్రశ్నించగా, 'స్వామీ! వాక్కాయములు రెండూ మనస్సుతో చేరినవి. నా మనస్సును మీకు అర్పించాను కదా! వారితో మాట్లాడుటకు మీ అనుజ్ఞ కావాలి. నాకు నా మనస్సుపై ఎట్టి అధికారము లేదు. మీరు ఏమి చెబితే అది చేస్తాను' అన్నాడు మహారాజు. అప్పుడు అష్టావక్రుడు, 'మహారాజా! మనోనాశనము అయినప్పుడే మానవునికి మహత్తరమైన బ్రహ్మప్రాప్తి లభిస్తుంది. ఎక్కు గుఱ్ఱమును. ఒక రికాబులో కాలు పెట్టు' అన్నాడు. అష్టావక్రుని ఆదేశమును శిరసావహించి మహారాజు ఒక రికాబులో కాలు పెట్టి మరొక రికాబులో కాలు పెట్టునంతలోనే బ్రహ్మానందమునందుకున్నాడు.

జనకమహారాజు అనేక మహర్షులతో కలసి ఆత్మశోధన చేస్తూ రాజయోగం లోపల నిర్వికల్ప సమాధి పొందుతుండేవాడు. అలాంటి సమయలో ఒక సాయంకాలము తన రాణి, చెలికత్తె, యింకా పరివారముతో వుంటుండే సమయంలో మాట్లాడుతూ మాట్లాడుతూ అట్లనే నిద్రపోయాడు. ఆ నిద్రలోపల ఒక స్వప్నం వచ్చింది. తన రాజ్యమంతా పోయినట్లు, తాను పిచ్చి పట్టి భిక్షమెత్తుకొని అరణ్యమంతా తిరుగుతున్నట్లు, అప్పుడు కొంతమంది పనివాళ్ళంతా భోజనము చేసి ఆ పాత్రలు కడుగుతున్నప్పుడు తాను ఆకలిబాధ తట్టుకోలేక అక్కడికి పరుగెత్తి యాచించినట్లు, అప్పుడు వాళ్లు ఆ పాత్రలలో అడుగున మాడిపోయి ఉన్న అన్నమును చేర్చి చేతిలో పెట్టినట్లు, దాన్ని తాను నోట్లో వేసుకోబోయే సమయంలో ఒక గ్రద్ద దాన్ని కొట్టినట్లు, ఆ అన్నమంతా క్రింద పడినట్లు, అదికూడా చిక్కలేదే అని తనకు తానే బాధతో, 'అయ్యో!' అని అరచినట్లు స్వప్నము వచ్చింది. 'అయ్యో!' అని ఒక్కతూరి గట్టిగా అరిచేటప్పటికి కలలోని అరుపు భ్రాంతి ఈ భౌతికం లోపలే వినిపించింది. అది విని భయపడి మహారాణి రాజును లేపింది.

లేచి చూసేసరికి తాను రాజుగానే ఉంటున్నాడు. జనకచక్రవర్తిగా ఉంటున్నాడు. ఒక సెకండు మునుపు భిక్షగాడుగా ఉన్నాడు. ఏది నిజం? ఇది నిజమా? అది నిజమా? అని తనకు తానే ప్రశ్నిస్తూ ఉన్నాడు. రాణి వాళ్ళంతా ఎంత అడిగిననూ, ఏమీ లేదు, 'ఇది నిజమా? అది నిజమా?' అని జవాబిస్తున్నాడు. ఇంక రాణివాళ్ళంతా భయపడిపోయి మంత్రులకు చెప్పి పంపినారు. అందరూ వచ్చి చేరారు. గురువైన అష్టావక్రుడు కూడా అక్కడికి చేరాడు. రాజును చూచిన తక్షణమే విషయమేమని తెలుసుకొని అష్టావక్రుడు,'రాజా! ఇదీ నిజము కాదు. అదీ నిజము కాదు. ఈ రెండూ చేరి నీవొక్కడవు ఉంటున్నావే అదే నిజం' అన్నాడు. అంటే ఈ జాగ్రత స్వప్నము వరకు నిజం. స్వప్నము జాగ్రత వరకు నిజం. ఇది నిజమా? అది నిజమా? రెండూ నిద్రలే!

జనకమహారాజు కుమార్తె, ఊర్మిళ. జనకుని తమ్ముని కుమార్తెలు మాండవి, శృతకీర్తులు. ఈ నలుగురిని దశరథమహారాజు కుమారులైన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు యిచ్చి వివాహము గావించాడు. ప్రమాణములు జరిగే సమయములో జనకుడు చెబుతున్నాడు, 'రామా! నా కుమార్తె అయిన సీతను నీకు దానం చేస్తున్నాను, అందుకో!' అన్నాడు. అప్పుడు వరుడు, 'నేను అంగీకరించాను, నేను తీసుకుంటున్నాను' అని చెప్పాలి. కానీ చెప్పటం లేదు. పురోహితుడు వచ్చాడు. 'రామా! కాలహరణం అవుతున్నది. నీవు ఒప్పుకో!' అని చెప్పాడు. అప్పుడు రాముడు, 'మాది ఇక్ష్వాకులవంశము. మేము ఇవ్వటమేగాని పుచ్చుకోటం మాకు అలవాటు లేదు. దానం ఇవ్వటమే గాని ఇతరులనుండి పుచ్చుకోటం మాకు అలవాటులేదు. అప్పుడు పురోహితుడు, 'ఇది కన్యాదానమయ్యా! పదార్థ దానం కాదు' అన్నాడు. 'కన్యకూడను ఒక పదార్థమే. ప్రకృతిలో ఉండునంతవరకు ప్రతి జీవుడూ పదార్థస్వరూపుడే కనుక, 'దానము' అని పేరు తీసివేస్తే నేను ఒప్పుకుంటాను' అన్నాడు రాముడు. అప్పుడు జనకమహారాజు, ఈ సూక్ష్మాన్ని గ్రహించి 'దానము' అనే పదమును తీసివేసి, 'నా కుమార్తె సీత, తల్లిలేని బిడ్డ. నీకు యిస్తున్నాను. చక్కగా చూసుకో!' అన్నాడు. అప్పుడు పురోహితుడు, 'సీతమ్మ తల్లి లేని బిడ్డ, రాముడు తండ్రి లేని బిడ్డ' అన్నాడు. సీత భూమాతకు పుడితే, పాయసం వలన పుట్టినవాడు రాముడని దీని అర్థము. ఈ ఇరువురు ప్రకృతి పరమాత్మ స్వరూపులు, సాక్షాత్

దివ్యశక్తి స్వరూపులు.

మహాకర్మయోగియైన జనకమహారాజు కూడనూ ఇరువురు కుమార్తెలను దగ్గరకు తీసుకొని కంటిధారలు కార్చాడు. ప్రజలందరూ ఆశ్చర్యపడ్డారు. 'ఇది దుఃఖం కాదు నాయనా! ఈ ప్రకృతి పరమాత్మయొక్క చేరికను నేను చూడాలని యింతకాలం వేచివున్నాను. ఈనాడు ప్రకృతి పరమాత్మయొక్క చేరిక జరిగింది. నా హస్తముల ద్వారా జరిగింది. ఈ ఆనందమును నేను భరించుకోలేక పోతున్నాను' అని చెప్పి తన రాజ్యమును, తన సర్వస్వమునూ, తన శక్తినంతనూ వారికే అర్పించాడు.